క్లుప్తంగా

కమ్యూనిటీహాల్ మంజూరు చేయండి



ఎమ్మెల్యే కసిరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆమనగల్లు: ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధి చంద్రాయణపల్లి తండాకు ఎస్టీ కమ్యూనిటీ హాల్ మంజూరు చేయాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని కాంగ్రెస్ నాయకులు కోరారు. బుధవారం నగరంలోని ఎమ్మెల్యే నివాసంలో.. మాజీ సర్పంచ్ కేశవులు, కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు రాములు, పట్టణ అధ్యక్షుడు మానయ్య, నాయకులు శ్రీనునాయక్, రాగ్యనాయక్, గోపాల్‌నాయక్, పత్యానాయక్‌లు కలిసి వినతి పత్రం అందజేశారు.

ఆర్థిక సాయం

కడ్తాల్: మండల కేంద్రానికి చెందిన గురిగళ్ల శేఖర్ అనారోగ్యంతో మంగళవారం రాత్రి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి బుధవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. రూ.15 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు లాయక్‌అలీ, లక్ష్మయ్య, రాంచంద్రయ్య, మల్లయ్య, జంగయ్య, వెంకటేశ్, దాసు, సురేశ్, కరుణాకర్, రాజు తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ స్థలాన్ని కాపాడండి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

ఆమనగల్లు: అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని గంగాభవానీ కాలనీవాసులు కోరారు. బుధవారం మున్సిపాలిటీ కమిషనర్ శంకర్‌నాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. 8 ఏళ్ల క్రితం ఆమనగల్లు పట్టణంలోని కాలనీలోని సర్కారు జాగలో అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులు ప్రారంభించారని, అయినప్పటికీ.. పనులు జరగలేదని తెలిపారు. కానీ ఆ స్థలాన్ని కొందరు ఆక్రమించి ప్రహరీ నిర్మించుకున్నారని పేర్కొన్నారు. ఇదే విషయమై గతంలో మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేశామని, అయినా ఎవరూ పట్టించుకోలేదని ఆరోపించారు. కబ్జాకు పాల్పడిన వ్యక్తులపై చర్యలు తీసుకొని, స్థలాన్ని పరిరక్షించాలని కోరారు.

బస్‌పాస్ చార్జీలు తగ్గించాలి



డిపో అసిస్టెంట్ మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఏబీవీపీ నేతలు

ఇబ్రహీంపట్నం: పెంచిన బస్‌పాస్ చార్జీలను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. బుధవారం ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీరాం, శివకృష్ణ, జగదీశ్, పవన్, మహేందర్, అనీల్‌లు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల అందజేత



ట్రైనీ ఎస్‌ఐకి సీసీ కెమెరాలు అందజేస్తున్న దాతలు

కడ్తాల్: ఆలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు దాతలు ముందుకు వచ్చారు. మండల పరిధి మక్తమాధారం గ్రామంలోని హనుమాన్ ఆలయానికి.. గ్రామానికి చెందిన ఎర్ర శ్రీనివాస్‌గౌడ్ రూ.10 వేల విలువ గల సోలార్ సీసీ కెమెరా, గ్రామంలోని మజీద్‌కు ముస్లింలు రూ.10 వేల విలువ చేసే సీసీ కెమెరాలను బుధవారం ట్రైనీ ఎస్‌ఐ చంద్రశేఖర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా దాతలను పోలీసులు, గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది మహేశ్, శ్రీధర్, నాయకులు బాలరాజ్, షాబుద్దీన్ ప్రభాకర్, జెనీల్, రమేశ్ తదితరులు ఉన్నారు.

ఆలయ నిర్మాణ పనులు ప్రారంభం

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం మంగళపల్లి గ్రామంలో బుధవారం పోచమ్మగుడి నిర్మాణ పనులను ఎంపీటీసీ మాజీ సభ్యుడు జంగయ్య, ఆలయ కమిటీ సభ్యులు ప్రారంభించారు. ఆలయ నిర్మాణానికి విశ్రాంత ఉద్యోగి కొప్పు జంగయ్య రూ.50 వేలు విరాళం అందజేశారు. దాతల సహకారంతో పనులు చేపట్టామని కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పుల్లయ్య, పెద్దయాదయ్య, చిన్నయాదయ్య, చంద్రయ్య, నర్సింహ, తానయ్య, పర్వతాలు, లక్ష్మయ్య, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

బడికి వేళాయె..

- ఆటలకు సెలవు.. స్కూళ్లకు పరుగు
- పుస్తకాలతో కుస్తీ పట్టనున్న విద్యార్థులు
- నేడు పాఠశాలల పునఃప్రారంభం
- అందుబాటులో పాఠ్య, నోట్ పుస్తకాలు



ఇబ్రహీంపట్నంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల

ఇబ్రహీంపట్నం: వేసవి సెలవుల్లో ఆటపాటలతో సరదాగా గడిపిన విద్యార్థులు.. గురువారం నుంచి బడిబాట పట్టనున్నారు. పాఠశాలలు పునఃప్రారంభం నేపథ్యంలో పుస్తకాలతో కుస్తీకి సిద్ధమవుతున్నారు. ఇబ్రహీంపట్నం మండలంలో 49 (14 ఉన్నత, 7 ప్రాథమికోన్నత, 26 ప్రాథమిక, ఒక కేజీబీవీ, ఒక ఆదర్శ పాఠశాల) సర్కారు బడులు ఉన్నాయి. వాటికి పాఠ్యపుస్తకాలు, రాత పుస్తకాలు చేరుకున్నాయి. సుమారు 5,140 మంది బాలబాలికలు విద్యనభ్యసిస్తున్నారు. ఇవేగాక ప్రభుత్వ సాంఘిక గురుకులాలు ఐదు, 35కు పైగా ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో 258 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు.

సమస్యలతోనే స్వాగతం

పలు పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కొరవడ్డాయి. కొన్నింటిలో తరగతి గదులు శిథిలావస్థకు చేరగా.. మరికొన్నింట్లో మరుగు దొడ్లు ఉన్నా.. నీటి కొరతతో పాటు విద్యుత్ సమస్య వేధిస్తోంది. పాఠశాలలకు స్కావెంజర్లను నియమించారు. కాపలాదారులు మాత్రం ఏ పాఠశాలకు లేకపోవడం గమనార్హం. రెండు పాఠశాలలు మినహా మండలంలో 15 స్కూళ్లలో మనఊరు–మనబడి పథకం కింద చేపట్టిన నిర్మాణాలు అసంపూర్తిగా నిలిచిపోయాయి.



విద్యాశాఖ కార్యాలయంలో పంపిణీకి సిద్ధంగా ఉన్న పుస్తకాలు

విస్తృతంగా బడిబాట..

బడీడు, బడి మానేసిన పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని కోరుతూ.. ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరుగుతున్నారు. విద్యార్థుల సంఖ్య పెంచాలన్న లక్ష్యంతో టీచర్లు బడిబాట కార్యక్రమం చేపట్టారు. ప్రభుత్వం అందజేస్తున్న సౌకర్యాల గురించి వివరిస్తున్నారు. ఈ నెల 6 నుంచి 19వ వరకు బడిబాట కొనసాగనుంది.

అన్నీ ఉచితం



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న బాలబాలికలకు పాఠ్య పుస్తకాలు, రాత పుస్తకాలు, ఒక్కో యూనిఫాం అందజేస్తున్నాం. మధ్యాహ్న భోజనం కొనసాగుతోంది. 1 నుంచి 5వ తరగతి విద్యార్థులకు వర్క్స్ బుక్స్ పంపిణీ చేస్తున్నాం. ఈ ఏడు విద్యార్థుల సంఖ్య పెరిగితే.. అందుకు అనుగుణంగా పుస్తకాలను అందుబాటులో ఉంచాం. బడుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషిచేస్తున్నాం.

– హీర్యానాయక్, మండల విద్యాధికారి, ఇబ్రహీంపట్నం

సర్కారు బడి స్థలాన్ని పరిరక్షించండి



తహసీల్దార్ ముంతాజ్‌కు వినతిపత్రం అందజేసిన హెచ్ఎంజంగయ్య

కడ్తాల్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల భూమిని ఆక్రమించుకోవడానికి కొందరు యత్నిస్తున్నారని, దానిని పరిరక్షించాలని ప్రధానోపాధ్యాయుడు జంగయ్య కోరారు. ఈ మేరకు బుధవారం తహసీల్దార్ ముంతాజ్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం హెచ్ఎం మాట్లాడుతూ.. సర్వే నంబర్ 65/1, 65/2లో సుమారు మూడు ఎకరాల విస్తీర్ణంలో పాఠశాల భవనం, క్రీడా మైదానం ఉందని, దానికి చుట్టూ రాతికడ్డీలతో ఇనుప ఫెన్సింగ్ ఉందని తెలిపారు. కాగా ఆ భూమిని కొందరు కబ్జాచేసేందుకు యత్నిస్తున్నారని పేర్కొన్నారు. ఇదే విషయాన్ని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, కలెక్టర్, ఆర్డీఓ తెలియజేస్తామని చెప్పారు.

గిరిజనుల కల సాకారం

- నేడు కత్వవాగు వంతెన ప్రారంభం
- హాజరు కానున్న ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యే కసిరెడ్డి



మేడిగడ్డతండా కత్వవాగు వంతెన

ఆమనగల్లు: గిరిజనుల కల సాకారం అయింది. ఆమనగల్లు మండలం మేడిగడ్డతండా– శంకరకొండతండాల మధ్య కత్వవాగుపై వంతెన నిర్మించాలని సుదీర్ఘకాలం పాటు నిరసనలు, విన్నపాలు ఇచ్చుకున్న నేపథ్యంలో.. రూ.3.10 కోట్లతో రూపుదిద్దుకున్న బ్రిడ్జిని.. ఈ నెల 12న నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిలు ప్రారంభించనున్నారు. ఇరు తండాల మధ్య ఉన్న వాగుపై వంతెన లేకపోవడంతో ఆయా తండాల ప్రజలు తీవ్ర ఇబ్బంది పడేవారు. వర్షాకాలంలో వాగు ప్రవహిస్తున్న సమయంలో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయేవి. దీంతో గిరిజనుల డిమాండ్ మేరకు మూడేళ్ల క్రితం పీఎంజీఎస్‌వై కింద నిధులు మంజూరయ్యాయి. ఎన్నో ఒడిదొడుకుల మధ్య వంతెన పూర్తయింది. రేపు ప్రారంభం కానుండడంతో తండావాసులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొననున్నారని, పార్టీ శ్రేణులు, ఇరు తండాల ప్రజలు హాజరు కావాలని కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు మండ్లి రాములు కోరారు.

అంగన్‌వాడీల్లో చిన్నారులను చేర్పించండి



యాచారం: చిన్నారులతో ఐసీడీఎస్ సీడీపీఓ వినిత తదితరులు

- 'అమ్మమాట.. అంగన్‌వాడీ బాట'లో ఐసీడీఎస్ సీడీపీఓలు శాంతిరేఖ, వినిత

కడ్తాల్: అంగన్‌వాడీల బలోపేతానికి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించిందని, 3 నుంచి 5 ఏళ్ల లోపు చిన్నారులను కేంద్రాల్లో చేర్పించాలని ఐసీడీఎస్ సీడీపీఓ శాంతిరేఖ, ఎంపీడీఓ సుజాత అన్నారు. బుధవారం మండల కేంద్రంలో 'అమ్మ మాట.. అంగన్‌వాడీ బాట' కార్యక్రమం నిర్వహించారు. 4 ఐసీడీఎస్ కేంద్రాల పరిధిలో 3 ఏళ్లు పైబడిన పిల్లలను చేర్పించాలని అవగాహన ర్యాలీ తీశారు. కేంద్రాల్లో అందిస్తున్న వసతులు, సౌకర్యాల గురించి వివరించారు. నమోదు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఐదేళ్లు పై బడిన వారికి గ్రాడ్యుయేషన్ డే నిర్వహించి, ప్రైమరీ స్కూళ్లలో చేర్పించేందుకు ప్రీ స్కూల్ సర్టిఫికెట్ అందజేశారు. కార్యక్రమంలో అంగన్ వాడీ సూపర్ వైజర్ శబరి, పీఆర్ఏ నిధి, కార్యదర్శి అల్లాజీ, ఎఎన్ఎం పుష్ప, ఉపాధ్యాయులు జ్ఞానేశ్వరి, మంగ, భాగ్య, యాదమ్మ, ఆశ కార్యకర్తలు తిరుపతమ్మ, సబితా, జ్యోతి, లావణ్య, స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

యాచారంలో..

యాచారం: ఐదేళ్ల లోపు చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉండాలని ఇబ్రహీంపట్నం ఐసీడీఎస్ సీడీపీఓ వినిత అన్నారు. యాచారం మండలం నానక్‌నగర్‌లో బుధవారం అమ్మమాట.. అంగన్‌వాడీ బాట కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీల్లో అడ్మిషన్లు, ప్రీస్కూల్ సిలబస్, టైంటేబుల్, వర్క్ బుక్స్, స్టోర్ బుక్స్‌పై తల్లులకు అవగాహన కల్పించారు. చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పిస్తే విజ్ఞానం పెరుగుతుందని సూచించారు.

విద్యుత్ ఉండని ప్రాంతాలు

తుర్కయంజాల్: సబ్‌స్టేషన్ పరిధి గుర్రంగూడ ఫీడర్, ఆదిత్యానగర్ ఫీడర్ పరిధిలో చెట్ల నరికివేత కారణంగా గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని ఏఈ రవీందర్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు గుర్రంగూడ, పోస్టల్ కాలనీ, గోల్డ్ ఫేస్ కాలనీ, జక్కిడి సత్తిరెడ్డి కాలనీ, సావిత్రమ్మ కాలనీ, బాబీర్ రెడ్డి కాలనీ, వెంకటేశ్వర కాలనీ, శ్రీనివాస పురం, గాధ్వి ఎన్‌క్లేవ్, వినాయక నగర్, శ్రీకృష్ణా కాలనీ, పంచాయతీ రాజ్ కాలనీ, బృందావనం కాలనీలో అంతరాయం కలగనుంది.

మధ్యాహ్నం నుంచి..

ఆదిత్యానగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆదిత్యానగర్, జయసూర్య పట్నం, లక్ష్మీనగర్, జీబీఆర్ కాలనీ, శ్రీశ్రీ అవెన్యూ, గుర్రంగూడ గ్రామం, ఎస్‌బీఆర్ కాలనీ, సాయిదుర్గా కాలనీ, సాయి హోమ్స్, టీచర్స్ కాలనీ, టీచర్స్ గ్రిల్డ్ కాలనీ, రాజలక్ష్మి నగర్, శ్రీలక్ష్మి కాలనీ, మ్యాట్రిక్స్ రిచ్ కాలనీలో సరఫరాకు అంతరాయం కలగనుందని, ఈ అసౌకర్యానికి చింతిస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

విగ్రహ ప్రతిష్ఠ పనులు ప్రారంభం

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మున్సిపల్ కార్యాలయం సమీపంలోని పురాతన శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో నూతనంగా రుక్మిణి, పాండురంగస్వామి విగ్రహాల ప్రతిష్ఠాపనకు నిర్మాణ పనులను బుధవారం ప్రారంభించారు. సీనియర్ న్యాయవాది నాగేశ్వర్‌రావు నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, మాజీ కౌన్సిలర్ ఇందిరాల రమేష్, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మహేశ్ పాల్గొన్నారు.

సమర్థవంతంగా 'ఉపాధి' కల్పన

- వనమహోత్సవానికి సిద్ధం కావాలి
- ఎంపీడీఓలు జంగయ్యగౌడ్, శైలజ



ఇబ్రహీంపట్నం: మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీఓ యెల్లంకి జంగయ్యగౌడ్

ఇబ్రహీంపట్నం: సమర్థవంతంగా ఉపాధిహామీ పథకాన్ని నిర్వహించాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ యెల్లంకి జంగయ్యగౌడ్ అన్నారు. బుధవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఉపాధి పథకంపై ఒరియెంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. కూలీలకు ఉపాధి కల్పించడంలో చొరవ చూపాలని సూచించారు. కూలీలకు సంబంధించిన ఏడు రిజిస్టర్ల నిర్వహణను నిర్లక్ష్యం చేయరాదని చెప్పారు. వానలు పడితే.. వన మహోత్సవానికి సిద్ధం కావాలని పేర్కొన్నారు. మొక్కలు నాటేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని, ముందుగానే స్థలాలను గుర్తించాలని పేర్కొన్నారు. లక్ష్యకు పైగా మొక్కలు నాటాలని, లక్ష్యాన్ని నిర్లక్ష్యం చేయవద్దని ఆదేశించారు. కార్యక్రమంలో ఉపాధిహామీ ఏపీఓ తిరమల చారి, మండల పంచాయతీ అధికారి రఘు, ఈసీ రవి, కార్యదర్శులు, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కూలీలకు చేతినిండా పని

యాచారం: ఉపాధి కూలీలకు చేతినిండా పని కల్పించాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ శైలజ అన్నారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశపు హాల్‌లో బుధవారం ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులకు ఉపాధి పనులపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కూలీలకు ఉపాధి కల్పించే విషయంలో నిబంధనలు పాటించాలని చెప్పారు. వాటిని అతిక్రమిస్తే.. సోషల్ అడిట్ సమయంలో ఇబ్బందులు వస్తాయని వివరించారు. కూలీలకు పని కల్పించే సమయంలో రికార్డుల నమోదు, పే స్లిప్పుల అందజేత, బిల్లుల జమ తదితర వాటిని పాటించాలని స్పష్టంచేశారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి శ్రీలత, ఈజీఎస్ ఏపీఓ లింగయ్య, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

కడ్తాల్‌లో..

కడ్తాల్: ఉపాధిహామీ పథకంలో చేపట్టవలసిన పనులపై బుధవారం ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులకు మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఓరియెంటేషన్ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ సుజాత, ఏపీఓ లలిత ఈజీఎస్ పనుల గురించి వివరించారు. జామ, మామిడి, దానిమ్మ, సపోట మొక్కలు పెంచేలా కృషి చేయాలన్నారు. వ్యవసాయ పొలాల్లో ఫాంపాండ్స్ నిర్మాణం, పశువులు, కోళ్ల షెడ్లు, రైతుల పొలాలకు రోడ్లు, ఇంకుడు గుంతల నిర్మాణం తదితర పనులపై సమగ్రంగా వివరించారు. కార్యక్రమంలో ఈసీ అంజయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం మండల అధ్యక్షుడు కాలే వెంకటేశ్, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఈజీఎస్ టెక్నికల్ సిబ్బంది ఉన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

మాడ్గుల: అర్హులందరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తుందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. సోమవారం నగరంలోని ఆయన నివాసంలో కాంగ్రెస్ పార్టీ మండల పరిధి నల్లా చెరువు నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలు అందజేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్ రెడ్డి, కొండల్ రెడ్డి, అంజయ్య, వెంకటేశ్, దర్శన్ రెడ్డి, జంగయ్య, వెంకట్ రెడ్డి ఉన్నారు.

పాఠశాలలను సందర్శించిన కమిషనర్



బాలికల ఉన్నత పాఠశాలను పరిశీలిస్తున్న కమిషనర్ శంకర్‌నాయక్

ఆమనగల్లు: పాఠశాలలు నేడు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలను బుధవారం మున్సిపల్ కమిషనర్ శంకర్‌నాయక్ సందర్శించారు. పారిశుద్ధ్య కార్యక్రమాలను చేయించారు. విద్యార్థులకు సురక్షిత తాగునీరు అందించేందుకు వాటర్‌ట్యాంక్‌లను శుభ్రం చేయించారు. చిన్నారులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

రేషన్ దుకాణాలకు తగ్గని రద్దీ



చౌకధరల దుకాణం వద్ద కార్డుదారుల నిరీక్షణ

ఇబ్రహీంపట్నం: రేషన్ షాపులకు లబ్ధిదారులు క్యూ కడుతున్నారు. ఒకేసారి మూడు నెలల సన్నబియ్యం పంపిణీ చేస్తున్న సంగతి తెలిసిందే. అయితే దుకాణాల్లో ఈపాస్ యంత్రాలు మొరాయిస్తుండటంతో మొదట్లో ప్రక్రియ మందకొడిగా సాగింది. ఒక్కో కార్డు దారుడు ఆరుసార్లు వెలిముద్ర వేయాల్సిరావడంతో 15 నిమిషాలకు పైగా సమయం తీసుకుంది. సాంకేతిక సమస్యను కొంతమేర పరిష్కరించడంతో తాజాగా మూడు సార్లు వెలిముద్ర వేస్తే సరిపోతుంది. దీంతో బియ్యం పంపిణీలో వేగం పుంజుకుంది. అయినప్పటికీ.. రద్దీ తగ్గడం లేదు. గతంలో ప్రతి నెల 15 వరకే బియ్యం పంపిణీ జరిగేది. ప్రస్తుతం మూడు నెలల బియ్యం ఒకేసారి ఇస్తుండటంతో.. ఈ నెల 30 వరకు బియ్యం పంపిణీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించిన విషయం విదితమే. గడువు పొడగింపుతో ప్రజలకు ఊరట లభించినట్లు అయింది.

కాళేశ్వరం పేరుతో కాలయాపన



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

కడ్తాల్: ఆరు గ్యారంటీలపై ప్రజల దృష్టిని మరల్చేందుకు.. కాళేశ్వరం మిషన్ పేరుతో ప్రభుత్వం కాలయాపన చేస్తుందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పరమేశ్ ఆరోపించారు. బుధవారం మండల కేంద్రంలో సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్ గుప్తా, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్‌నాయక్, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డిలతో ఆయన మాట్లాడారు. హామీలను అమలు చేయకుండా, కాళేశ్వరం ప్రాజెక్టుపై కేసీఆర్, హరీశ్‌రావులకు నోటీసులతో కాంగ్రెస్ కొత్త నాటకానికి తెరలేపిందని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై మాట్లాడే అర్హత ప్రభుత్వానికి లేదని, లక్షల ఎకరాలకు సాగు నీరు, తాగునీరు అందించడమే లక్ష్యంగా నిర్మాణం జరిగిందన్నారు. మేడిగడ్డ బ్యారేజీలో రెండు పిల్లర్లు కుంగితే, ప్రాజెక్ట్ మొత్తం కుంగినట్లు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. అసత్య ప్రచారాలు మాని.. ప్రజా సంక్షేమంపై దృష్టి సారించాలని సూచించారు. సమావేశంలో నాయకులు జోగువీరయ్య, మాజీ సర్పంచ్ కృష్ణయ్య, దాసు, శ్రీకాంత్, సురేశ్, ప్రశాంత్ ఉన్నారు.

సమస్యల పరిష్కారమే 'భూభారతి' లక్ష్యం

- రైవెన్యూ సదస్సులను వినియోగించుకోండి
- తహసీల్దార్లు షేక్ ముంతాజ్, వినయ్ సాగర్



కడ్తాల్: రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ ముంతాజ్

కడ్తాల్: రైతుల భూ సమస్యల పరిష్కారమే భూభారతి చట్టం లక్ష్యమని తహసీల్దార్ షేక్ ముంతాజ్ అన్నారు. అందులో భాగంగా ఊరూరా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని, భూ బాధితులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మండల పరిధి ఎక్వాయిపల్లి, టాక్‌రాజ్‌గూడ గ్రామాల్లో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఎక్వాయిపల్లిలో 54 దరఖాస్తులు, టాక్‌రాజ్‌గూడలో 6 అర్జీలు అందాయని రెవెన్యూ అధికారులు తెలిపారు. డీటీ ఆదిత్యరాజు, ఆర్ఐ రాజేందర్‌రెడ్డి రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మాడ్గులలో..

మాడ్గుల: రెవెన్యూ సదస్సులతో రైతుల భూ సమస్యలు త్వరగా పరిష్కారం అయ్యేందుకు అవకాశం ఉందని తహసీల్దార్ వినయ్ సాగర్ అన్నారు. బుధవారం మండల పరిధి నాగిళ్ల గ్రామంలో తహసీల్దార్ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. రైతుల నుంచి 40 ఫిర్యాదులు అందుకున్నారు. కార్యక్రమంలో సిబ్బంది యాదయ్య, శ్రీను, సందీప్, విజయ, సురేందర్ పాల్గొన్నారు.

కొంగరకలాన్‌లో..



మాడ్గుల: నాగిళ్లలో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ వినయ్ సాగర్

ఇబ్రహీంపట్నం రూరల్: భూ సమస్యలు పరిష్కరించేందుకే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని ఇబ్రహీంపట్నం డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధి కొంగర కలాన్‌లో ఫెరోజ్‌గూడ, కొంగరకలాన్‌లో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఫెరోజ్‌గూడలో 3, కొంగరకలాన్‌లో 6 దరఖాస్తులను రైతుల నుంచి స్వీకరించామని అధికారులు తెలిపారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ ముస్తాఫ, సిబ్బంది విష్ణు, కృష్ణ, సూర్య రైతులు తదితరులు పాల్గొన్నారు.

భూ హక్కుల పరిరక్షణ



ఆమనగల్లు: దరఖాస్తులు స్వీకరిస్తున్న ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి

ఆమనగల్లు: భూ భారతి చట్టంతో భూ హక్కులు పరిరక్షించబడతాయని కందుకూరు ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. ఆమనగల్లు మండలం సింగంపల్లి గ్రామంలో బుధవారం తహసీల్దార్ లలిత ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. కొత్త చట్టంతో రైతులకు మేలు జరుగుతుందన్నారు. ఈ చట్టంలో న్యాయ సలహా వ్యవస్థ ఉంటుందని, ఇది సమస్యలను పరిష్కరించడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. చట్టం అమలులో భాగంగా గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. దీని ద్వారా 90 శాతం సమస్యలు స్థానికంగానే పరిష్కారమవుతాయని వివరించారు. సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సదస్సులో వివిధ సమస్యలపై 26 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ లలిత చెప్పారు. ఇందులో మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ ప్రేమలత, మాజీ ఉపసర్పంచ్ పోచాలు, కృష్ణయ్య, శివ, రాజు, కృష్ణయ్య, రెవెన్యూశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.